ప్రజాశక్తి

శనివారం 10 డిసెంబరు 2022 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

మాండూస్ కలవరం



- తడిసిన వరి పనలు, కుప్పలు
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 24 శాతం వరి కోతలు పూర్తి
- 76 శాతం పంట పొలాల్లోనే

ప్రజాశక్తి - కృష్ణా, విజయవాడ ప్రతినిధులు

మాండూస్ తుపాను ప్రభావంతో గురువారం అర్ధరాత్రి నుంచి కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో స్వల్పంగా వర్షాలు కురిశాయి. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ జారీ చేసిందిన హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ ముప్పు ముంచుకు రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతులంతా వరి కోతలు, నూర్పిడిలు, ధాన్యం రవాణా వంటి వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కృష్ణా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో వరి సాగైంది. నవంబరు చివరి వారం నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. రెండు జిల్లాల్లోనూ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 20 శాతం నుంచి 24 శాతం వరకు వరి కోతలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. కృష్ణాజిల్లాలో సుమారు 90 వేల ఎకరాల్లోను, ఎన్టీఆర్ జిల్లాలో 40 వేల ఎకరాల్లోను పూర్తయినట్లు చెబుతున్నారు. ఇంకా దాదాపు 76 శాతం నుంచి 80 శాతం వరి పంట పొలాల్లోనే ఉంది. సాధారణంగా ప్రతి ఏటా డిసెంబరు నెలాఖరులోగా వరి కోతలు పూర్తవుతాయి. ఇదిలాఉంటే ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) ద్వారా పౌరసరఫరాల అధికారులు ఎన్టీఆర్ జిల్లాలో 5 వేల నుంచి 5400 టన్నులు, కృష్ణా జిల్లాలో 48వేల నుంచి 50వేల టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు సమాచారం.

ఆందోళనలో వరి, మిర్చి రైతులు

ప్రజాశక్తి - అవనిగడ్డ, కోడూరు, కంచికచర్ల, వత్సవాయి : కృష్ణాజిల్లా అవనిగడ్డ, కోడూరుతోపాటు దివిప్రాంతంలో కురిసిన చిరుజల్లులకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే రైతులు మిషన్ల ద్వారా వరి కోతలు కోసి ధాన్యాన్ని రహదారులపై ఆరబెడుతుండగా, మరోవైపు వేలాది ఎకరాల్లో కోతలు కోసి చేలల్లో పనుల మీద ఉంది. కోడూరు మండలంలో పాలకాయతిప్ప కరకట్ట వద్ద బీచ్ ప్రవేశ ద్వారాన్ని పోలీసులు మూసివేశారు. పర్యాటకులెవరూ బీచ్ వద్దకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. మత్స్యకారులు కూడా సముద్రంలో వేటకు వెళ్లడం మంచిది కాదని సూచించారు. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, వత్సవాయి, మైలవరం, విజయవాడ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుండి చలిగాలులు వీయడంతోపాటు చిరు జల్లులు పడడంతో రైతులు కలవరపాటుకు గురయ్యారు. ఇప్పటికే కొందరు రైతులు వరి కోతలు కోసి ధాన్యం కేంద్రాల్లో ఆరబోశారు. ఇంకా కోయాల్సిన వరి పంట 50 శాతానికిపైగా ఉంది. మిర్చి మొదటి, రెండో దశ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడవకుండా రైతులు హడావుడిగా పట్టాలు కప్పుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాజిల్లా మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ, పమిడిముక్కల, పామర్రు తదితర మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యాయి. కృష్ణాజిల్లావ్యాప్తంగా 40 వేల ఎకరాలు పనలపైనే ఉంది. వర్షపు జల్లులకు ఈ పనలు తడిచాయి. కొంతమేర కట్టేత పూర్తయిన వరి మోపులు, అసంపూర్తిగా ఉన్న కుప్పల్లోకి వర్షపు నీటికి నానాయి. దీంతో ధాన్యం నాణ్యత తగ్గి మద్దతు ధరలో కోత పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిద్రావస్థ తక్కువగా ఉన్న కొన్ని రకాల వంగడాల్లో ఈ జల్లులకు మొలకొచ్చే ప్రమాదం ఉంది. ఖరీఫ్ సీజన్లో జిల్లాలో మొత్తం 3.96 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇప్పటికి కొంత మేర హార్వెస్టింగ్ పూర్తయింది. మొత్తం 5.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా. కాగా ఇప్పటికి కేవలం 53 వేల టన్నులు మాత్రమే ప్రభుత్వం సేకరించింది. లక్ష ఎకరాల్లో హార్వెస్టింగ్ పూర్తియిన ధాన్యపు రాసుల్లో తేమశాతం తగ్గించేందుకు రోడ్లపక్కన ఆరబెట్టి ఉన్నాయి. వీటిపై పరజాలు కప్పుకున్నారు. మరికొందరు రైతులు ఎక్కువ మంది కూలీలను పెట్టి కోతలు కోస్తుండగా, మరికొందరు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. అలాగే నూర్చిన ధాన్యాన్ని మిల్లర్లకు చేరవేస్తున్నారు. వాతావరణం సహకరించకపోవడంతో తేమశాతం తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ధాన్యం నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని యంత్రాలతో హార్వెస్టింగ్ చేసిన రైతులు వాపోతున్నారు. గాలుల తీవ్రత పెరిగితే వరి పొలాలు నేలవాలే పరిస్థితి ఉంది. తుపాను నేపథ్యంలో వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులు కూడా రైతులను అప్రమత్తం చేశారు. మూడు రోజులపాటు కోతలు కోయొద్దని, నూర్పిడి చేయొద్దని రైతులకు సూచించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది వరి పంట దిగుబడి ఆశాజనంగా ఉంది. కానీ మాండూస్ తుపాను వారిని కలవరపెడుతోంది. శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు తొమ్మిది మండలాల్లో 10 మిల్లీ మీటర్లు వర్షపాతం

(మిగతా 6లో)



నీటి మీటర్లను పరిశీలిస్తున్న బాబూరావు, కృష్ణమూర్తి

తాగునీటి మీటర్ల ప్రక్రియ నిలుపుదల

సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : నీటిని సరుకుగా చేసుకొని వ్యాపారం చేయడానికి విజయవాడ నగరపాలక సంస్థ నీటి మీటర్లను ఏర్పాటు చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. మధురానగర్ పసుపు తోటలో శుక్రవారం బాబూరావు పర్యటించి ఇళ్లకు బిగించిన నీటి మీటర్లను పరిశీలించారు. స్థానిక ప్రజల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ నీటి మీటర్ల ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బలవంతంగా నీటి మీటర్లను ఇళ్లకు బిగిస్తే ప్రజలే వాటిని తొలగిస్తారని హెచ్చరించారు. రాజకీయపక్షాలతో, నగర ప్రజలతో చర్చించకుండా ఏకపక్షంగా నీటి మీటర్లు బిగించడాన్ని స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. కష్ణానది తీరాన ఉన్నా నగరంలో ఇళ్లకు నీటి మీటర్ల పేరుతో నీటిఛార్జీల భారాన్ని ప్రజలపై మోపుతోందన్నారు. అమత్ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయి నీటి మీటర్లకు శ్రీకారం చుట్టడం గర్హనీయమన్నారు. 24 గంటలు నీటి సరఫరా సాకుతో నీటి మీటర్లు పెట్టడం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.కష్ణమూర్తి, చిన్నా, రామారావు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో రోబోటిక్ పరిజ్ఞానం

రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

రైతు బాగుండాలి. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర అందించాలి. ఇదే ప్రభుత్వ లక్ష్యం' అని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్. నాగిరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ అనుబంధ రంగాల భాగస్వామ్య పక్షాల ముఖాముఖి చర్చా కార్యక్రమం శుక్రవారం మచిలీపట్నంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాలులో నిర్వహించారు. ఈచర్చా కార్యక్రమంలో నాగిరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పంటల ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు వ్యవసాయ రంగంలో ఆధునిక రోబోటిక్ టెక్నాలజీని రైతులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్రంలో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలోకి డ్రోన్లు ప్రవేశించాయని తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల్లో ఎక్కడాలేని విధంగా, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా వివిధ పథకాల ద్వారా రూ.85 వేల కోట్లు రైతుల ఖాతాలో నేరుగా ప్రభుత్వం జమ చేసిందని గుర్తుచేశారు. 2019లో ఖరీఫ్‌లో రాష్ట్రంలో 80.13 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. ఈ ఏడాది ఈ రికార్డు బ్రేక్ చేసే అవకాశం ఉందన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు నేరుగా మద్దతు ధర జమ చేయడంతోపాటు కాటా కూలి, రవాణా ఛార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తోందన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 40 లక్షల నుండి 45 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి ఉందన్నారు. అధికారులు రైతుల సమస్యలను మనస్సు పెట్టి పరిష్కరించాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలను సుస్థిరం చేసేందుకు మార్కెటింగ్ ఇంటర్ వెన్షన్ కోసం సీఎం

(మిగతా 6లో)



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్ నాగిరెడ్డి



దీక్షలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

యనమలకుదురు వంతెన వెంటనే నిర్మించాలి

దీక్షా శిబిరంలో ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

ఎంఎల్ఎ హామీతో దీక్షల విరమణ

ప్రజాశక్తి - పెనమలూరు : యనమలకుదురు లాకుల వద్ద ఆగిపోయిన వంతెన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ వంతెన సాధన కమిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం 48 గంటల నిరాహార దీక్షలను చేపట్టారు. ఉదయం 9 గంటలకు పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు దీక్షల్లో కూర్చున్న వారికి ఉదయం 10 గంటలకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. అయితే పోలీసులు ఈ దీక్షలకు అనుమతి నిరాకరించడంతోపాటు దీక్షలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. సీఐ గోవిందరాజులు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని నిరసనకారులతో వాగ్వాదానికి దిగారు. దీక్షలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయినా దీక్షలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ 11 ఏళ్లక్రితం వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులు పూర్తి చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శంగా ఉందన్నారు. యనమలకుదురు లాకుల వంతెన సమీపంలో బందరు కాల్వపై వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి కొనసాగడం శోచనీయమన్నారు. ఈ సమస్యపై 48 గంటల నిరాహార దీక్షకు పోలీసులు అనుమతించకపోవడం దుర్మార్గమన్నారు. సమస్యలపై ప్రజలు నిరసన తెలుపుకునే హక్కు ఉందన్నారు. కాంగ్రెస్

(మిగతా 6లో)

విఎంసి సొసైటీ నూతన పాలకవర్గానికి సన్మానం

ప్రజాశక్తి-విజయవాడ

విఎంసి ఉద్యోగుల సొసైటీ నూతన పాలకవర్గాన్ని నగరపాలక సంస్థ ఆఫీసు సబార్డినేట్స్ అసోసియేషన్ శుక్రవారం ఘనంగా సత్కరించింది. నూతన పాలకవర్గం అధ్యక్షులు గుంజా అజయ్‌కుమార్, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు, వైస్ ప్రెసిడెంట్ గుర్రం ఆంజనేయులు, సెక్రటరీ తిరుమారెడ్డి బ్రహ్మారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ సింహాద్రి మస్తాన్ రావు, ఇతర డైరెక్టర్లు, వేజెండ్ల ప్రభావతి, భూపతి గోవింద రావు, గుంటక ప్రభాకర రెడ్డి, తోపుల శివ శంకర్, బచ్చు రాజేష్, తాడిశెట్టి నాగరాజులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ... సొసైటీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ విజయం ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని, ప్రతి ఓటరు ఆదరించి, తమకు అత్యధిక మెజార్టీని ఇచ్చారని గుర్తు చేశారు. సొసైటీ బ్యాంక్ అభివృద్ధితో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఓట్లు పరంగా తమను ఆదరించి గెలిపించడంతో పాటు ప్రత్యేకంగా అభినందన కార్యక్రమం నిర్వహించడం విఎంసి ఆఫీసు సబార్డినేట్స్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆఫీసు సబార్డినేట్స్ అసోసియేషన్ వారు ప్రెసిడెంట్ శీలం కరుణ, వైస్ ప్రెసిడెంట్ గంజి సతీష్ బాబు, సెక్రటరీ మాడుగుల నీలమ్మ, జాయింట్ సెక్రటరీ బెవర వరలక్ష్మి, కోశాధికారి తాడిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.


నూతన పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణ మండప నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని పెనుగోలను గ్రామ శివారు మెట్టగొట్టలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ సమీపాన కళ్యాణ మండప నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కళ్యాణ మండప నిర్మాణానికి గంపలగూడెం ఎంపిపి దంపతులు గోగులముడి చెన్నకేశవరెడ్డి, గోగులముడి శ్రీలక్ష్మిలు 10 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించి కళ్యాణ మండపం కమిటీ సభ్యులకు అందజేశారు

విద్యుత్ సమస్యలపై ప్రజల అర్జీలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయవాడ : విద్యుత్ సమస్యపై ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి నగరపాలక సంస్థలోని విద్యుత్ విభాగం అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో వీఎంసీ విద్యుత్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వీధి దీపాల వ్యవస్థపై చర్చించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. శీతాకాలం దష్ట్యా సాయంత్రం వేళ ఒక గంట ముందుగా వీధి దీపాలు వెలిగేలా చూడాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు.వీఎంసీ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఫణీంద్ర కుమార్, వీఎంసీ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్‌ఎల్‌ఆర్ ప్రతిభ' కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-తిరువూరు : తిరువూరులోని ఎస్‌ఎల్‌ఆర్ ప్రతిభ మోడల్ డిగ్రీ కళాశాలలో మొదటి సం వత్సరం విద్యార్థులకు సీనియర్ వి ద్యార్థులు శుక్రవారం ఏర్పాటుచేసిన స్వాగత కార్యక్రమం ఉత్సాహం జరిగింది. ముందుగా కళాశాల డైరెక్టర్ లక్కి నేని ప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ హైస్కూల్ నుండి ఇంట ర్మీడియట్ చదువు పూర్తి చేసుకొని వ చ్చిన ప్రతి విద్యార్థికి డిగ్రీ చదువు భవిష్యత్తుకు పునాది లాంటిదని పేర్కొ న్నారు. మీఉన్నత లక్ష్యాన్ని నిర్ణయించుకునేది కూడా డిగ్రీ చదివే నని, కాబట్టి ప్రతి విద్యార్థి క్రమశిక్షణగా ఉంటూ, ఎంచుకున్న మీ లక్ష్య సాధన కోసం దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్య క్రమాల పాల్గొని అందరిని అలరించా రు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్ శ్రీనివాసరావు అధ్యాపకులు పాల్గొ న్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం జిల్లా శిక్షణ కేంద్ర సమన్వయకర్త టి. మాధవి లత పొలంబడులోని మేలైన యాజమాన్య పద్ధతులు ధ్రువీకరణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ పొలంబడిలోని మేలైన యాజమాన్య పద్ధతులు, మార్గదర్శకాలు మరియు ప్రాధాన్యత గురించి వివరించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వరి, పత్తి, మొక్కజొన్న మొదలగు పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ టి జోగేంద్ర ప్రసాద్, డిఆర్సి సహాయ వ్యవసాయ సంచాలకులు యోగేష్, జగ్గయ్యపేట టెక్నికల్ ఏజె సిహెచ్ సౌజన్య, వ్యవసాయ అధికారులు టి రామసుబ్బారెడ్డి, పి రవికుమార్, రవీంద్ర మరియు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -తిరువూరు

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే తయారుచేసిన యుటిఎఫ్ 10వ తరగ తి స్టడీ మెటీరియల్ ను తిరువూరు మండలంలోని కోకిలంపాడు జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో 33 మంది విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశా రు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.ఎస్.జి.కె గుప్తా, ఉపాధ్యాయులు జె.మురళీకష్ణ, ఎం.సునీత రాణి, జి.రామకష్ణ, కె.రవికిరణ్, పి.శోభారాణి, ఎస్.కె.బాజీ, పి.గోపి, కె.దివ్య, వి.నాగరత్నం, నిరోషా తదిత రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-నందిగామ

నందిగామకు చెందిన బిటెక్ విద్యార్థి కొప్పు వంశీ కృష్ణ (22) శుక్రవారం తెల్లవారుజామున తోటచర్ల వద్ద 65 వ నెంబరు జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మతి చెందారు. కృష్ణ వంశీతో పాటు స్నేహితుడు దినేష్ ఇద్దరు హైదరాబాద్ నుండి నందిగామ కు బైక్ పై వస్తుండగా, పొగమంచులో రోడ్డు కనిపించక తోటచర్ల వద్ద డివైడర్ ను ఢీ కొట్టడంతో తీవ్ర రక్త స్రావం అయి వంశీ అక్కడికక్కడే మృతి చెందారు. స్నేహితుడు దినేష్ తీవ్రంగా గాయపడటంతో నందిగామ ప్రభుత్వ ఆస్పత్రి లో చికిత్స చేయించుకుని మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. నందిగామ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రముఖ వ్యాపార వేత్త కొప్పు భాస్కర్ కుమారుడు వంశీ కష్ణ. వంశీ కష్ణ బి.టెక్ ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకుని క్యాంప్ స్ సెలక్షన్లో జాబ్ సాధించాడు.


వంశీ కృష్ణ (ఫైల్)

వాడీవేడిగా చెవిటికల్లు పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం వాడి వేడిగా జరిగింది. 2021 ఫిబ్రవరిలో ఎన్నికైన రోజు జరిపిన సమావేశం 22 నెలల తర్వాత జరిపారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ బుడ్డి విజయలక్ష్మి అధ్యక్షతన గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే కార్యదర్శి కనగాల రవికుమార్ ఎజెండా పుస్తకం ఇచ్చి సంతకాలు పెట్టమని సభ్యులను కోరాడు. అయితే ఎప్పుడో ఏడాదిన్నర క్రితం నుండి రాసిన ఎజెండా పై సమావేశం జరిగినట్లు సంతకాల పెట్టమని కోరటం తో సభ్యులు ఒక్కసారిగా కార్యదర్శి తీరుపై ధ్వజమెత్తుతూ నిరసన వ్యక్తం చేశారు. దీనిపై కార్యదర్శి స్పందించి, సభ్యులు సంతకాలతో పని లేకుండా నేను చేసుకోగలను, అభివృద్ధి పనులు విషయమై సభ్యులతో ప్రతిసారీ చర్చించి, చేయాలంటే కుదరదని బాధ్యతాయుతంగా సమాధానం చెప్పటంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం సాధారణ సమావేశాలు నిర్వహించి, ఎజెండా పై చర్చలు జరిగినప్పుడు సర్పంచ్ లుగా, సభ్యులుగా ఎన్నికై ఎవరిని ఉద్ధరించటానికని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

అంబాపురంలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలంలో అంబాపురం, పి. నైనవరం గ్రామాలలో శు క్రవారం నిర్వహించిన 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమంలో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు పాల్గొన్నారు. ఈ సందరభంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో సామాన్యుడికి కరెంటు ఉచితంగా లభిస్తే వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ప్రజలపై 8 సార్లు కరెంటు చార్జీలు పెంచిందన్నారు. అలాగే బీసీల అభివద్ధికి తెలుగుదేశం పార్టీ పెట్టిన పథకాలు అన్నికూడా ఆపేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొద్దల చిన్న రామారావు, పార్లమెంటు ఉపాధ్యక్షులు దండు సుబ్రహ్మణ్యం రాజు, గ్రామ పార్టీ కార్యదర్శి సిద్దిల రాజా తదితరులు పాల్గొన్నారు ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పేదవాడి ఇంటి నిర్మాణ కలను నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ విమర్శించారు. పట్టణంలోని 2 వ వార్డు కాకాని నగర్ లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకష్ణ, సామినేని మనోహర్, పేరం సైదేశ్వర రావు, గునుగు భాస్కరరావు, మర్రిపుడి శ్రీనివాసరావు (కారం శ్రీను), కల్లం రామిరెడ్డి పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి-నందిగామ : మానవ హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని నందిగామ కష్ణాజిల్లా 16వ అదనపు న్యాయస్థానం జిల్లా జడ్జి వి.శ్రీనివాసరావు అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శు క్రవారం నందిగామ పట్టణంలో జిల్లా కోర్టు నుండి గాంధీ సెంటర్ వరకు న్యాయవాదులు ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవ హక్కుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మానవ హక్కుల ఉల్లంఘణ జరితే కోర్టులను ఆశ్రయించి న్యాయం పొంది నష్ట పరిహారం తీసుకోవచ్చు అని తెలిపారు. మానవ హక్కుల చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లో నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెకంటి జీవరత్నం,ఎపిపి ఇ.రంగారావు, వై.బాబురావు, ఎం.నారాయణరావు, ఆజాద్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు .ప్రజాశక్తి - తిరువూరు : అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐడియాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరువూరు అ క్షర (సాయి) డిగ్రీ కళాశాలలో శుక్రవా రం మానవహక్కుల అవగాహనా సద స్సు జరిగింది. 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్య సమితి సర్వజనీయ మాన వ హక్కుల ప్రకటన చేసిన ఆవశ్యకత ను ఐడియాస్ వ్యవస్థాపకులు శౌరీ వి వరించారు. ఈకార్యక్రమంలో కళా శాల డైరెక్టర్ ధనుంజయ్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, చంద్రరావు, ఐడియాస్ సిబ్బంది సిరికొండ అభి, బషీరా, విద్యా ర్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పటిష్టతకు కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నందిగామ : అంగన్వాడీ కేంద్రాల పటిష్టతకు ప్రభుత్వం కృషి చేస్తోందని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. పల్లగిరి గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని శుక్రవారం నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో ఆప్యాయంగా ముచ్చ టించారు. విద్యార్థులకు పెడుతున్న పౌష్టికాహారం పై అంగన్వాడి కార్యకర్తలను వివరాలు అడిగి తెలుసు కున్నారు. అంగన్వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్ళ గా తీర్చిదిద్దుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎంపిపి అరిగెల సుందరమ్మ, జడ్పిటిసి గాదెల బాబు, పల్లగిరి సర్పంచ్ రవి కిరణ్ రెడ్డి,కష్ణారెడ్డి,మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -జగ్గయ్యపేట

పట్టణంలోని 13వ వార్డులో కట్టమీద ఆంజనేయస్వామి గుడి వద్ద పరిసర ప్రాంతాలలో రోడ్డ నిర్మాణ పనులకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షుడు ఆకుల బాజీ, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, వైఎస్సార్సీపీ నాయకులు పటాన్ ఫిరోజ్ ఖాన్, కాటగాని నరసింహారావు, చిరంజీవి, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు యధావిధిగా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు : ఎస్ఇ

ప్రజాశక్తి-విజయవాడ : రెండవ శని వారం, ఆదివారం సెలవు రోజులయినప్పటికీ అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు యధావిధిగా పని చేస్తాయని ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎం శివప్రసాదరెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-మైలవరం : బాలబాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించినట్లయితే మంచి భవిష్యత్తు ఉంటుందని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ షిరీన్ అన్నారు. భారత రాజ్యాంగం వారోత్సవాల్లో భాగంగా మైలవరం మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులచే వ్యాసరచన వకృత్వ పోటీలు మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించి ఆయా రంగాల్లో ప్రతిభ కనబరిచిన బాల బాలికలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. మైలవరం కోర్టు వద్ద న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన సదస్సులో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జడ్జి షేక్ షరీఫ్ బాలబాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. మైలవరం మాజీ అధ్యక్షులు బుద్ధవరపు వెంకట్రావు అధ్యక్షులు ముల్లంగి రవికుమార్ న్యాయవాది ఎం తనూజ్ పాల్గొన్నారు.



విద్యార్థులు వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలి : నాగిరెడ్డి



శాస్త్రవేత్తలతో కలిసి వరిని పరిశీలిస్తున్న నాగిరెడ్డి

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని, ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానాలను రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్.నాగిరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో సాగు చేస్తున్న పంటలు, వాటి రకాల గురించి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.శ్రీలతను అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలతో మాట్లాడి రైతుల అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరాలు సేకరించారు. అనంతరం ఘంటసాల వ్యవసాయ పరిశోధనా స్థానంలో సాగు చేస్తున్న నూతన వరి వంగడాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు విషయాలపై ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డా సత్యప్రియ లలితతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఇక్కడ చదువుతున్న చాలామంది విద్యార్థులు రైతు కుటుంబాల నుంచి వచ్చినట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు ఇంతటితో ఆగకుండా ఉన్నత చదువులు చదివి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. రైతులే దేశానికి వెన్నుముక్క అని, రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు తీసుకొస్తుందన్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ధాన్యాన్ని తరలించినందుకు ట్రాన్స్ పోర్టు ఖర్చులు, గోనె సంచులు ఇవ్వటం, కాటా కూలీ ఇవ్వటంతోపాటు ఎన్నడూలేని విధంగా ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. గతంలో సీడ్ డ్రిల్ విధానం ఘంటసాల మండలంలోనే తొలిసారిగా చేపట్టారని గుర్తు చేసుకున్నారు. బిపిటి 5204 రకాన్ని కూడా మొదట ఎవరు అంగీకరించలేదని, తర్వాత బాగా ప్రచారంలోకి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల గురించే ఆలోచిస్తుందని, చిన్న చిన్న సమస్యలు ఉంటే నివృత్తి చేయటం జరుగుతుందని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ రాఘవరావు, ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నాగేంద్రరావు, కెవికె. ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు మంజువాణి, రేవతి, వెంకటలక్ష్మి సత్యంత్ కుమార్, నవీన్ పద్మావతి, లహరి, వైసిపి మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావ్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, రైతులు వేమూరి రత్నగిరిరావు, వేమూరి ప్రవీణ్, కొల్లూరి శ్రీనివాసరావు, మూల్పూరి వెంకయ్య, దేవినేని విజయ్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శిపై క్రిమినల్ కేసు

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్, ఇఒపై గన్నవరం పోలీసులు క్రిమినల్ కేసు పెట్టారు. నిందితులపై 420, 406, రెడ్ విత్ 34 సెక్షన్ల నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం గ్రామపంచాయతీలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నట్లు పాలకవర్గ సభ్యులు, ఎంపీటీసీల 3 ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఇటీవల విచారణకు ఆదేశించారు. గుడివాడ డివిల్పిఒ సంపత్‌కుమారి నేతృత్వంలో బృందం విచారణ జరిపి సర్పంచి నిడమర్తి సౌజన్య , పంచాయతీ కార్యదర్శి నక్కా రాజేంద్రవరప్రసాద్ రూ . 1.59 కోట్లు నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారించారు. దీనికి సర్పంచ్, ఇఒను చెరి సమానంగా బాధ్యులను చేస్తూ కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా ఇప్పటికే ఇఒ రాజేంద్రవరప్రసాద్‌ను పంచాయతీరాజ్ కమిషనర్ సస్పెండ్ చేశారు. అంతే కాకుండా నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్, ఇఒపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. ఈ మేరకు ఎంపీడీవో ఫిర్యాదు మేరకు సర్పంచ్, ఇఒపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆరోపణల్లో వాస్తవంలేదు

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిషత్ టీచర్స్ కోపరేటివ్ సొసైటీ పై కొందరు ఉపాధ్యాయులు చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమని ఆ సొసైటీ పర్సన ఇంచార్జ్ జీవిఎస్ పెరుమాళ్ళు, కార్యదర్శి బాలయ్య, సొసైటీ సభ్యులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 11 మంది సభ్యులుగా చేరేందుకు రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు చేసుకున్నారని సంబంధిత ఉపాధ్యాయులను గతంలో పనిచేసిన చోటు నుండి డ్యూస్ నో మెంబర్షిప్ సర్టిఫికెట్లు తెచ్చామని చెప్పడంతో సొసైటీలో సభ్యులుగా చేరవచ్చునని రిజిస్టర్ పోస్టు ద్వారా తెలియజేశామని తెలిపారు. ఒక ఉపాధ్యాయుని సర్టిఫికెట్ తెచ్చి సభ్యత్వం పొంది అత్యవసరంగా అప్పు కూడా పొందారని తెలిపారు. లోను దారుల నుండి అదనంగా ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కెబి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

లింగ వివక్ష పాటిస్తే చర్యలు

గన్నవరం : ఎవరైనా లింగ వివక్ష పాటిస్తే చర్యలు తప్పబోవని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. ఉంగుటూరు గ్రామంలో శుక్రవారం లింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ బాలికల చదువు నైపుణ్యాల పెంపుదల అవకాశాలను కోల్పోయిన కారణం చేత దేశం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. విద్య, ఆర్థిక, సామాజిక అవకాశాల్ని పొందలేకపోతున్నారన్నారు. లింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా అందరూ ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

బందరు నగరంలో జరిగిన మన్యు సూక్త హోమం , శ్రీ లక్ష్మి నారాయణ మహా క్రతువు శాంతి కళ్యాణంతో శుక్రవారం ఘనంగా ముగిశాయి. 225 మందికి పైగా ఋత్విక్కులు, గడిచిన 6 రోజులుగా మన్యు సూక్తహోమం, క్రతువులు పూజలు నిర్వహించారు. ఈ యాగంలో అధికారులు, ఉద్యోగులు, మహిళలు అశేష సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎం.పి. కొనకళ్ల నారాయణ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, ప్రదీప్, ప్రముఖ ఆడిటర్ శ్రీనివాసగుప్తా, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మండలం వీరవల్లి పాల సొసైటీ పరిధిలోని 160 మంది సభ్యులకు బోనస్‌గా రూ. 2,12,500లను సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి నిరంజన్‌రావు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు కోడేబోయిన బాబి, లంక వెంకటేశ్వరరావు, అరవపల్లి సీతారామయ్య, రాయి సాంబశివరావు, డి.సురేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సొసైటీ కార్యదర్శి చలమూరి రామచంద్రరావు, హెల్పర్ అమృతపల్లి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాషా

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

ధాన్యం సేకరణ కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులకు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ బంగ్లాలో వివిధ శాఖల అధికారులతో ధాన్యం సేకరణ పురోగతి పై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 200కు పైగా కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించి, అన్ని కేంద్రాలను ప్రారంభించామన్నారు. ధాన్యం సేకరణలో ముందుగానే గోనె సంచులు సిద్ధం చేయాలని వాటిని కేంద్రాలకు పంపిణీ చేసి, కొనుగోలు కేంద్రాల్లో తేమ పరీక్ష, తూకం, తూర్పార బట్టే పరికరం, టార్పాలిన్, సిబ్బంది కావాల్సినవి అన్ని అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం ఎప్పటికప్పుడు తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టా పాస్ బుక్ లేని రైతుల జాబితా తయారు చేసి, ముందస్తుగా ధ్రువీకరణలు అందజేయాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు సేకరణలో భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, ఎఫ్‌సిఐ మేనేజర్ శ్రీధర్, డిఆర్డీఓ సీతాపతి రావు, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్‌రావు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యోగామృత ప్రాసన క్రియతో ఆరోగ్యం : శ్రీనివాస్

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్



యోగామృత ప్రాసన క్రియతో సర్వరోగాలు నయం చేయొచ్చునని యోగాగురు యోగా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జిల్లాకోర్టు సెంటరులోని షిరిడి సాయిబాబా మందిర భవంతిలో మీడియా సమావేశం నిర్వహించారు. గత 16 సంవత్సరాల నుండి జంట తెలుగు రాష్ట్రాలలో ధ్యాన, యోగ ప్రచారానికి యోగామృతప్రాసన క్రియ అనే వర్క్ షాప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ధ్యాన యోగ ఫౌండేషన్ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరం 2 వ అంతస్తులో ఈనెల 12 నుంచి 20 వ తేదీ వరకు 9 రోజుల పాటు యోగ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆశాల నియామకాలకు దరఖాస్తులు : గీతాబాయి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కృష్ణాజిల్లాలో గ్రామ, వార్డ్ సెక్రెటేరియేట్లలో పనిచేయటానికి ఆశా కార్యకర్తలు నియామకం కోసం దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం అర్బన్ 98, రూరల్18 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించారు. గౌరవ వేతనంగా రూ.10 వేలు ఇస్తారని పేర్కొన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన ధరఖాస్తులను ఈ నెల 12న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు, విద్యార్హతల నకలు సంబంధిత ఏరియా పి హెచ్ వి, యూపిహెచ్ సి మెడికల్ ఆఫీసరుకు సమర్పించి రశీదు పొందాలని కోరారు. తప్పని సరిగా అభ్యర్థి సంబంధిత గ్రామ, అదే వార్డులో నివసిస్తూ 25 నుండి 45 సం. వయసు కలిగి వివాహితులై ఉండాలని అన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణతతో పాటు ఇంటర్మీడియట్ అర్హతకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. వితంతువులు, విడాకులు, భర్త నుండి విడిపోయిన లేదా నిరాశ్రయురాలైన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. తెలుగు చదవటం, రాయడం తప్పని సరిగా వచ్చి ఉండాలని తెలిపారు.

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : జనసేన

ప్రజాశక్తి-అవనిగడ్డ

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని అవనిగడ్డ మండల జనసేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సామాన్య వరి రకం 2040 గ్రేడ్ ఏ రకం రూ.2060 మద్దతు ధర ప్రకారం రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని తేమశాతం 17 ఉంటే మాత్రమే మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నార్నారు. తుఫాను కారణంగా వాతావరణంలో వచ్చిన మార్పుల ప్రకారం ధాన్యంలో తేమశాతం 20కి పైనే ఉంటుందన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం కుంటి సాకులు ఎందుకు చెబుతుందో తెలియడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గురువాక శేషబాబు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, మండలి శివప్రసాద్, పప్పుశెట్టి గోపీనాథ్, తుంగల నరేష్, కమ్మిలి సాయి భార్గవ, హోసూర్ అవినాష్, అప్పికట్ల భాస్కర్, రేపల్లె రోహిత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ భారతి పుట్టినరోజు వేడుకలు

అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతి పుట్టినరోజు వేడుకలను అవనిగడ్డ



కేకు కట్ చేస్తున్న ఎంపిపి తుంగల సుమతీదేవి తదితరులు

మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు తుంగల సుమతీ దేవి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యురాలు గోళ్ళ కృష్ణకుమారితో కలిసి శుక్రవారం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యులు నజీర్ భాష, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ సూపరింటెండెంట్ అత్తుల్లా, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం

అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని మూడో వార్డు అవనిగడ్డ శ్రీనివాసరావుకు చెందిన నాలుగు దూలాల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైనట్లు ఫైర్ ఆఫీసర్ పిఎస్ వి వి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకోగా హుటాహుటీన ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని చుట్టుపక్కలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేసినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో రూ.2.90 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారి తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభ గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ : ఎస్ఎఫ్ఐ 17వ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ నందిగామ కెవిఆర్ కాలేజీ లో వాల్ పోస్టర్లు నందిగామ కెవిఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.రాయప్ప , అధ్యాపకులు ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభలు డిసెంబర్ 13 నుండి 16 వరకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఈ మహాసభలు దేశంలో విద్యారంగ ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళపై అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలు రూపకల్పన చేయనుందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక జాతీయ విద్యా విధానం పేరుతో మొత్తం విద్య వ్యవస్థను ప్రైవేటీకరణ, కార్పొరేటికరణ, కాషాయీకరణ చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో సీఎం జగన్ ప్రతిఏటా జాబ్ క్యాలండర్ విడుదల చేశాను అని చెప్పి ఇంతవరకు విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూళ్లలో 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. జీవో నెం 77తో విద్యార్థులకు వసతి దీవెన అందడంలేదదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నందిగామ కెవిఆర్ కాలేజీ అధ్యాపకులు వాసుదేవరావు, పీడీ నాగేశ్వరరావు నరేంద్ర,ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి జి.గోపి నాయక్,ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్ రఫీ, కోటేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలు గోడపత్రికలను డాక్టర్ జాకీర్‌హుస్సేన్ కళాశాలలో శుక్రవారం సోమేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 3,4,5 తరగతుల విలీనం పేరుతో అదే పాఠశాలలను మూత వేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ స్థానంలో విద్యాదీవెన వసతి దీవెన అని పేర్లు మార్చరే తప్ప కొత్తగా చేసింది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు జి గోపినాయక్ కళాశాల ప్రిన్సిపల్ మహాభాష అధ్యాపకులు పాల్గొన్నారు.



నందిగామ, ఇబ్రహీంపట్నంలలో గోడ పత్రికలు ఆవిష్కరణ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



మాట్లాడుతున్న పద్మజా షా

మహిళలపై దాడులను అరికట్టాలి

- 'సేఫ్' సదస్సులో పలువురు వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నా నేటికీ వరకట్న హత్యలు, గృహహింస, అత్యాచారాలు పెరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సేఫ్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్దార్థ మహిళా కళాశాల ఆడిటోరియం నందు శుక్రవారం ఉదయం ' మహిళలపై హింస - మీడియా ' అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ నేడు అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి జరుగుతుందని, ముఖ్యంగా మహిళలు అత్యున్నత స్థాయి హోదాలో ఉంటున్నారని అయినా ఎక్కడో ఒకచోట మహిళలు ప్రతి రోజూ వివిధ రకాలుగా హింసకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వెండితెర, బుల్లితెర మాద్యమాలలో చూపించే కార్యక్రమాలు ఏవిధంగా పిల్లలపైన దుష్ప్రబావం పడుతుంతో ఉదాహరణలతో సహా వివరించారు. ముఖ్యంగా మావన సంబంధాలపైన పలు వ్యక్తుల మద్య అభద్రతా భావం పెరిగి బంధాలు సన్నగిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. కల్పన మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకూ మహిళలపై దాడులు పెరుగుతున్నాయని వీటిని అరికట్టాల్సిన అవసరం ఎంతయినా ఉందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదురించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సేఫ్ అధ్యక్షులు జి.జ్యోత్న్న, కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి. విజయలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మొబైల్ అన్న క్యాంటీన్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - వన్‌టౌన్

పేద ప్రజల కోసం టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో ఏర్పాటు చేసిన మొబైల్ అన్న క్యాంటిన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని 52వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంఛార్జి బుద్దా వెంకన్న, తెలుగుదేశం పార్టీ బీసీ, మైనార్టీ నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ వారిచే నడపబడుతున్న మొబైల్ అన్న క్యాంటీన్ 43వ రోజు శుక్రవారం 52వ డివిజన్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52వ డివిజన్ కార్పరేటర్ ఉమ్మడి చంటి, యువ నాయకులు కాండ్రేగుల రవీంద్ర చేతుల మీదుగా మొబైల్ అన్న క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సాదరబోయిన ఏడుకొండలు, ఈగల సాంబ, గణప రాము, దేవరాజు, కొట్టేటి హనుమంతరావు, చీపుల్ల వెంకటేశ్వరరావు, సోము వెంకటేశ్వర్లు, నూకరాజు, తారక, చెంచయ్య , పిళ్ళా వంశీ తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్ష నివారణపై అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట :

లింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా జాతీయస్థాయి ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పట్టణంలోని గురుకుల పాఠశాలలో లింగ వివక్షత పై మరియు బాలికలపై లైంగిక దాడులను నివారించుటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్షత బాలికలపై లైంగిక దాడుల పై బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు లక్ష్మీకాంతం, సుజాత, మహిళా పోలీసులు సౌజన్య, శ్రీలక్ష్మి మరియు అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో రూ.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు

పెనుగంచిప్రోలులో ఉన్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో 14 కోట్ల రూపాయల వ్యయంతో పలు అబివృద్ధి కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్య నారాయణ, రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో దేవాలయాలకు మహర్దశ కలిగిందని అన్నారు. రాష్ట్రంలోని 36 ప్రధాన ఆలయాలలో మాస్టర్ ప్లాన్ అమలు చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలలో ధూప దీప నైవేద్యాలు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రధానంగా ఎనిమిది ముఖ్య దేవాలయాలు ఉండగా దానిలో ఒకటి పెనుగంచిప్రోలు దేవస్థానం ఉండడం సంతోషమని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ అమ్మవారి ఆలయం దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో సుమారు 14 కోట్ల రూపాయల వ్యయంతో కేశఖండన శాల, టాయిలెట్స్ నిర్మాణం, డార్మిటరీ హాల్ నిర్మాణం, పాపమాంబ వనంలో ఫంక్షన్ హాల్, భక్తులకు సౌకర్యం కోసం సంత్రం గదులు, ఆడిటోరియ స్థలం తదితర పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఆలయ చై ర్మన్. ఇంజం. చెన్న కేశవరావు, ఆలయ ఈఓ జి.వి. డి. ఎన్. లీలా కుమార్, ఆలయ ప్రధాన పూజారి. మర్రేబోయిన వెంకట రమణ, ఎంపిపి. మార్కాపూడి.గాంధి, జెడ్ పిటీసి.ఊట్ల. నాగమణి, గ్రామ సర్పంచ్ వేల్పుల. పద్మ కుమారి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సత్యనారాయణ

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని నిరసన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఈ నెలాఖరు లోగా అందచేయాలని, జగనన్న గహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనేపుడి శంకర్ డిమాండ్ చేశారు. జగ్గయ్య పేట పట్టణంలో గల టిట్కో ఇళ్ళ లభిదారులకి ఇళ్ళను అందించాలని, జగనన్న ఇళ్లకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టిడ్కో , జగనన్న లబ్ధిదారులు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ జగ్గయ్యపేటలో సుమారుగా 3,245 టిడ్కో గహాలు 80 శాతం నిర్మాణం పూర్తయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా విష సర్పాలకు కేంద్రంగా తయారయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జోనెబోయిన శ్రీనివాసరావు, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంభోజి శివాజీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లంక గోవిందరాజులు, పెయ్యల పథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని తీర్మానం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్

ధాన్యంలో 21 శాతం తేమ ఉన్నప్పటికీ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజయవాడ రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం కోరింది. ఈ మేరకు మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల కమిటీ సమావేశం తీర్మానం చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేసి, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కల్పిస్తున్నారు. అయితే, మంచు వల్ల తేమశాతం అధికంగా ఉన్న నేపథ్యంలో నిబంధనలను సడలించాలని పలువురు రైతులు చైర్మన్ నాగిరెడ్డిని కోరారు. దీనిపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సమావేశం సూచించింది. అలాగే దాళ్వా వరి సాగు, మినుము, జొన్న విత్తనాలపైనా చర్చ జరిగింది. సమావేశంలో మండల వ్యవసాయాధికారి బి రంగనాథబాబు, నున్న సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి , విద్యుత్ ఎఇ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని కొత్తపల్లి గ్రామం లో గల రైతు భరోసా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో వైపి రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 1061 రకం ధాన్యాన్ని ఒక క్వింటాలకు 2060 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని ఉద్యోగులకు సూచనలు చేశారు కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వంగల వైకుంఠం, గ్రామ కార్యదర్శి విజయ్ కుమార్, ఎంపీఈఓ పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు ఇబ్రహీంపట్నం 9వ మండల మహాసభ కొండపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ఈ సభలో పాల్గొన్న ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, అంగన్వాడీ, ఆశా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధుల నుంచి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కొండపల్లి ఆయిల్ గ్యాస్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని లారీ డ్రైవర్స్‌కి ఇఎస్ఐ పిఎఫ్ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు డివి కృష్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కనుసన్నల్లో లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని కార్మికుల హక్కులను కాల రాస్తుందన్నారు. ఈ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముందుగా సిఐటియులో పనిచేసి ఇటీవల మరణించిన కార్మికులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ ఉపాధ్యక్షులు శ్యాంసన్ కొండలరావు దేవుళ్ళు సుందరరావు రామకృష్ణ ఖాదర్ సహాయ కార్యదర్శులు సులోచన మీనా సిఐటియు నాయకులు సూరిబాబు బాలాజీ జాషువా ఉషా నిర్మల నారాయణ బాబురావు రామారావు పాల్గొన్నారు.




మహసభలో మాట్లాడుతున్న ఎన్‌సిహెచ్ శ్రీనివాస్

జూనియర్ ఎన్‌టిఆర్‌ను రాజకీయంగా అడ్డుకున్న చంద్రబాబు : జోగి

ప్రజాశక్తి-గుడివాడ

దేశంలో ఎక్కువ శాతం ఉన్న బిసిలకు ఎక్కడా జరగని న్యాయం చేసిన వ్యక్తి, వారి ఆత్మగౌరం కోసం రాజ్యసభ నుండి పంచాయతీ బోర్డు మెంబర్లుగా గుర్తింపు వచ్చేలా కృషిచేసిన వ్యక్తి సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరురోడ్డులో బిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుకోల్లు వెంకటమల్లేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావుల ఆధ్వర్యంలో బిసి నూతన కార్యాలయం, నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి జోగి రమేష్, జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక, మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ 1983లో బిసిలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించిన గొప్ప వ్యక్తి ఎన్‌టిఆర్ అన్నారు. ఉన్నత చదువులు చదవాలంటే అగ్రవర్ణాలకు చెందిన వారే ఉండేవారన్నారు. అలాంటి స్థితి నుండి వైఎస్ రాజశేఖరరెడ్డి బిసిలు ఉన్నత చదువుల చదువుకోవడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉన్నత విద్యను అందించేలా కృషి చేశారన్నారు. బిసిల కోసం పనికిరాని వస్తువులు ఇచ్చిన చంద్రబాబు నేడు వారు తమ పార్టీ డిఎన్‌ఏలు అని చెప్పటం సిగ్గుగా ఉందన్నారు. గుడివాడలో కొడాలి నానిని ఓడించే దమ్ము ఎవ్వరికీ లేదన్నారు. మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) మాట్లాడుతూ ఎన్‌టిఆర్ డిఎన్‌ఏ జూనియర్ ఎన్‌టిఆర్‌ను పాతాళనికి తొక్కి, ఎందుకు పనికిరాని సంకర జాతి డిఎన్‌ఎ ఉన్న లోకేష్ (పప్పు)ని ముఖ్యమంత్రిని చేయాలనే చంద్రబాబు బిసిలకు ఏమి న్యాయం చేస్తాడో ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మారేష్, మహిళా అధ్యక్షురాలు వేముల బేబిరాణి, వైసీపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మల్లాయిపాలెంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో గృహ నిర్మాణం పూర్తి చేసుకున్న గృహాలను శుక్రవారం మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నానిలు సందర్శించారు. నిర్మాణం పూర్తయిన కుటుంబ సభ్యులు, చిన్నారులతో సంభాషించి సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొడాలి నాని, పక్కన మంత్రి జోగి రమేష్

విద్యారంగం అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత

పమిడిముక్కల ఎంపిపి కాసాని వేద సుప్రజ

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయటానికి నిరంతరం కృషిచేస్తున్నారని పమిడిముక్కల మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ అన్నారు. పమిడిముక్కల మండలంలోని కృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ముసలినాయకపాలెంలో నాడు-నేడు పథకం ద్వారా రూ.25 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి కాసాని వేదసుప్రజ మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్యం, విద్యారంగాల బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అన్ని తరగతుల ప్రజలకు మేలు చేకూర్చటానికి సిఎం జగన్, పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ నిరంతరం కృషిచేస్తున్నారని వివరించారు. పమిడిముక్కల జెడ్పీటీసీ యేనుగు వెంకట రమణకుమారి మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సహకారంతో కృషిచేస్తున్నామని వివరించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి ప్రాధాన్యత ఇస్తున్నామని కృష్ణాపురం సర్పంచ్ వరంకి బలుసులమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, వైసిపి నాయకులు పాతూరు చంద్రపాల్, అజీజ్, పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, అనంతపురం గ్రామ సర్పంచ్ కలపాల రాంబాబు, మామిడిపల్లి గ్రామ సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం, కంబపు రాంబాబు, యేనుగు మస్తానరావు, కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కోటయ్య, బండ్రపల్లి శ్యామ్, పాతూరి చంద్రపాల్, యలమంచిలి గణేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



నాడు నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి సుప్రజ

అంతర్జాతీయ రోలర్ హాకీ పోటీలకు డాక్టర్ కెకె ఆర్ గౌతమ్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-గుడివాడ

త్వరలో బెంగుళూరులో జరిగే 60వ అంతర్జాతీయ రోలర్ హాకీ స్కేటింగ్ పోటీలకు డాక్టర్ కె.కెఆర్ గౌతమ్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్స్ సత్యారామ్, జ్యోతిలు తెలిపారు. శుక్రవారం స్థానిక డాక్టర్ కె.కెఆర్ గౌతమ్ స్కూల్‌లో అంతర్జాతీయ జట్టుకు ఎంపికైన భావన, నిఖిల, కోచ్ అయప్పలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో జరిగి రాష్ట్రస్థాయి 34వ రోలర్ హాకీ స్కేటింగ్ పోటీల్లో భావన, నిఖిలు పతకాలు సాధించారని పేర్కొన్నారు. త్వరలో జరిగే 60వ అంతర్జాతయ రోలర్ హాకీ స్కేటింగ్ పోటీలకు ఎంపిక అవడం అభినందనీయమన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన అయప్పను గౌరవించడం గొప్ప విషయమన్నారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

మోడల్ టెస్ట్ పేపర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం యుటిఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్షులు బి. కనకారావు ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ పేపర్లు ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థులు చదువుకునేందుకు మొత్తం ఆరు సబ్జెక్టుల్లో 24 టెస్ట్ పేపర్లు పేద విద్యార్థులకు అందుబాటులో ఉండే ధరతో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ టెస్ట్ పేపర్లు ఆయా సబ్జెక్టులలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో రూపొందించామని కనకారావు తెలిపారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పి వి వర్మ, కె.నాంచారయ్య,పి.కిరణ్ కుమార్,ఎం.అశోక్ పాల్గొన్నారు.



టెస్ట్ పేపర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి : వంశీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటునాన్నని గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శుక్రవారంనాడు ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం ద్వారా అందుతున్న నవరత్నాల పథకాల గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఆశీస్సులతో గన్నవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దటానికి తన శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గస్థాయి నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వైసిపి కన్వీనర్లు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీమోహన్

ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి

ఎపి కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు కె.శివనాగేంద్రం

ప్రజాశక్తి-ఉయ్యూరు

తేమ శాతంతో సంబంధం లేకుండా పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతుసంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు కె.శివనాగేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉయ్యూరు మండలం కాటూరు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులపై అధికారికి శుక్రవారం రైతు సంఘం నాయకులు అన్నే సుబ్బారావు, కె శివ నాగేంద్రం, రైతులు పలు డిమాండ్లపై వినతి పత్రం సమర్పించారు. ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న సమస్యల గురించి ప్రభుత్వం దష్టి సారించాలని కోరారు. పంట నూర్పిళ్ళు ముమ్మరంగా జరుగుతున్నందున, తుపాను పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించి రైతులను ఆదుకోవాలని కోరారు. అనేక చోట్ల గోని సంచులు అందుబాటులో ఉండటం లేదనీ, టెక్నికల్ అసిస్టెంట్లు, తేమ శాతం మిషన్లు, రవాణా సదుపాయాలు సరిగా ఉండటం లేదని పేర్కొన్నారు. ఆర్ కేంద్రాల్లోనే తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలనీ, రైస్ మిల్లు వద్ద తేమ శాతం నిర్ధారించకూడదని పేర్కొన్నారు. ఈ క్రాప్‌ను సడలించి కౌలు రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనీ, కాటా వేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా ఆర్ బి కేకేంద్రాల బాధ్యతతోనే మిల్లుకు పంపించాలని కోరారు. ధాన్యం తోలిన ఏడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.రాజేష్, మండల నాయకులు ఏసు పాదం, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు. అనంతరం కలువపాముల రైతుభరోసా కేంద్రంలో కూడా అధికారికి వినతిపత్రాన్ని నాయకులు అందజేశారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న కె.శివనాగేంద్రం, రైతు, కౌలురైతుసంఘం నాయకులు

బీచ్ ప్రవేశ ద్వారం మూసివేత

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండల పరిధిలోని పాలకాయతిప్ప కరకట్ట వద్ద అటవీశాఖ, మెరైన్ పోలీసుల, లా అండ్ ఆర్డర్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు బీచ్ ఎంట్రన్స్ గేట్లు మూసివేశారు. తుపాను నేపథ్యంలో పర్యాటకులెవ్వరూ బీచ్ వద్దకు వెళ్లడానికి వీలు లేదని పేర్కొన్నారు. వాతావరణం అనుకూల పరిస్థితులు లేదన్నారు. మత్స్యకారులు కూడా ఇలాంటి పరిస్థితుల్లో సముద్రంలో వేటకు వెళ్లడం మంచిది కాదని సూచించారు. ఈ కార్యక్రమంలో కోడూరు ఎస్సై రాజేంద్రప్రసాద్, కోడూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, పాలకాయతిప్ప మెరైన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బీచ్ ద్వారం గేటును మూసివేసిన పోలీసులు

‘తూర్పు’లో అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో తూర్పు నియోజకవర్గంలోని 15, 16, 17, 19, 20, 21, 22 డివిజన్లకు సంబంధించిన అభివద్ధి పనులపై శుక్రవారం సమీక్ష జరిగింది. అభివృద్ధి పనులతోపాటు పెండింగ్‌లో ఉన్న పనులు, కొత్త ప్రాజెక్టులు, సచివాలయం వ్యవస్థపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈసమావేశంలో కార్పొరేటర్లు ఉమ్మడిశెట్టి రాధిక, తంగిరాల రామిరెడ్డి, మొహమ్మద్ రెహనా నాహిద్, అడపా శేషగిరి, పుప్పాల నరస కుమారి, తాటిపర్తి కొండారెడ్డి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ సిటీప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, జోనల్ కమిషనర్-3 డాక్టర్ ఏ.రవిచంద్, జాయింట్ డైరెక్టర్ (అమత్) డా.కె.బి.ఎన్.ఎస్ లతా, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, ఇఇ వి.చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

యనమలకుదురు వంతెన వెంటనే నిర్మించాలి

ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత వరకు నిర్మించి వదిలేశారన్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంతెన వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. ఈ సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఐక్యవేదిక చేపట్టిన నిరసనకు తమ మద్దతు ఉంటుందన్నారు. దీక్షలో కూర్చున్న వారికి పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు నెరుసు ఆంజనేయులు, టి గణేష్, లోకేష్, ఎస్‌కె.మస్తాన్‌వలి, పి.శ్రీనివాసరావు, వి.జీవ, పుసులూరు పాతాళలక్ష్మి, టి.జయలక్ష్మి, ఉప్పాడ త్రిమూర్తులు తదితరులు సంఘీభావం తెలిపారు. దీక్షలో వంతెన ఐక్యవేదిక కన్వీనర్ ఎస్‌కె.ఖాసీం, వాటపల్లి శ్రీరాములు, ఎస్.కె ఇబ్రహీం, ఎస్.కె.హుస్సేన్ బి.సజ్జ వెంకటేశ్వరమ్మ, పుసులూరి లక్ష్మీనారాయణ తదితరులు కూర్చున్నారు. స్థానిక ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి తరపున వైసిపి గ్రామ నాయకులు వెలగపూడి వరప్రసాద్, యార్లగడ్డ వీరబాబు, కోసూరి నరేష్ తదితరులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి ఎంఎల్‌ఎ హైదరాబాద్‌లో ఉన్నారని, జనవరిలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారని పేర్కొన్నారు. దీంతో ఐక్యవేదిక నాయకులు స్వయంగా ఎంఎల్‌ఎనే ఈ విషయాన్ని చెప్పాలని పట్టుబట్టారు. అక్కడికి వచ్చిన ప్రతినిధులు ఎంఎల్‌ఎతో ఫోన్లో మాట్లాడించారు. జనవరిలో పలును ప్రారంభించి శివరాత్రి కల్లా పూర్తి చేస్తామని నిర్దిష్టమైన హామీ ఇవ్వడంతో దీక్షలను విరమించారు. శివరాత్రి కల్లా వంతెన పనులు పూర్తి కాకపోతే ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉదతం చేస్తామని హెచ్చరించారు.



నిరసన కారక్రమంలో ఆర్.రఘు తదితరులు

మాండూస్ కలవరం

నమోదైంది. మచిలీపట్నంలో3.6 ఘంటసాలలో 2.6, పెదపారుపూడి 1.4, గుడివాడ, ఉయ్యూరుల్లో మండలంలో 0.8, గుడివాడ, మొవ్వ, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో 0.2 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

వరి నాణ్యత దెబ్బతినకుండా ద్రావణం పిచికారీ చేయండి

మచిలీపట్నం వరిపరిశోధనా క్షేత్రం సీనియర్ శాస్త్రవేత్త గిరిజారాణి

వర్షాలకు నిద్రావస్తలేని బిపిటి 5204, ఎంటియు 1075 రకాలు చేనుపై మొలకలొచ్చే అవకాశం ఉందని, వీటిని సాగు చేసిన రైతులు వర్షాలు నిలిచిన తర్వాత 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపైన పిచికారీ చేసుకోవాలని మచిలీపట్నం వరిపరిశోధనా క్షేత్రం సీనియర్ శాస్త్రవేత్త గిరిజారాణి రైతులకు సూచించారు. ఈ ద్రావణం పిచికారీతో గింజ మొలకలు ఆగడంతో పాటు, ధాన్యం రంగు మారదని తెలిపారు. ధాన్యం రాసులు తడిచినా ఇదే పద్ధతిని అనుసరించాలని పేర్కొన్నారు. చేను నేలవాలిన మూడు రోజులపాటు నీటిలో నానితే నిద్రావస్త ఉన్న రకాలకు ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. రెండోపంటగా మినుము, వేరుశనగ చల్లిన పొలాల్లో నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వ్యవసాయంలో రోబోటిక్ పరిజ్ఞానం

యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రతిరోజూ యాప్‌లో స్థానిక వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నమోదు చేస్తారని, మద్దతు ధరకన్నా తక్కువ ఉన్నచోట రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ జన్ను రాఘవరావు, పామర్రు ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యులు, వ్యవసాయ మిషన్ ముఖ్య శాస్త్రవేత్త ఎం.చంద్రశేఖర్, ఎమ్మెల్యే నాని, ల్లా వ్యవసాయశాఖ అధికారి మనోహరరావు మాట్లాడారు. ఈసమావేశంలో జిల్లా హార్టీ కల్చర్ అధికారి కె.జ్యోతి, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, సెరీ కల్చర్ అధికారి సత్యనారాయణ, మైక్రో ఇరిగేషన్ అధికారి జయలక్ష్మి, స్థానిక వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త గిరిజారాణి, వ్యవసాయశాఖ ఎడిలు, పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పెదపట్నంలో 2 వేల ఎకరాల్లో చెరువుల లీజు రద్దు

- యర్రంశెట్టి రామచంద్రరావు, ఆక్వా రైతు

విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని బందరు మండలం పెదపట్నంనకు చెందిన ఆక్వా రైతు యర్రంశెట్టి రామచంద్రరావు కోరారు. కరెంటు బిల్లులు, మేత ధరలు పెరిగిపోవడంతో రొయ్యలు సాగు కష్టంగా మారిందన్నారు. ఈ కారణంతోనే పెదపట్నంలో రెండు వేల ఎకరాల్లో చెరువుల లీజులను రద్దు చేసుకున్నారని చెప్పారు. సముద్రానికి 500 మీటర్ల దూరంలోని ప్రైవేటు భూములను ఆక్వాజోన్ నుంచి తొలగించడం అన్యాయమన్నారు. విద్యుత్ ఛార్జీలు యూనిట్ రూ.1.50 నుంచి రూ.4కు పెరిగాయన్నారు. గతంలో రూ.30 వేలు వచ్చే బిల్లు ఇప్పుడు లక్షల్లో వస్తోందన్నారు. హేచరీల నుంచి నాణ్యమైన సీడ్ అందించాలని కోరారు.

బుడమేరులో చెరువులు కొట్టేయండి : నాగిరెడ్డి

బుడమేరు వరద కట్టల మధ్యలో ఆక్వా చెరువుల తవ్వకాలు కారణంగా ఎగువ గ్రామాలకు ముంపు ముప్పు పొంచి ఉందని ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. బుడమేరు పరీవాహక ప్రాంతంలోని కృష్ణాజిల్లాలో 23 చెరువులు, ఏలూరు జిల్లాలో 19 చెరువులు ఉన్నాయన్నారు. బాపులపాడు మండలం ఓగిరాల గ్రామంలో నాన్ ఆక్వా జోన్లో 23 ఎకరాల్లో చెరువుల తవ్వారని, ఈ చెరువుల తవ్వకాలకు మత్స్యశాఖ ఎలా ఆమోదం తెలిపిందో అర్థం కాలేదన్నారు. అక్రమంగా తవ్విన చెరువులు కొట్టేయాలని ఈ ఏడాది ఆగస్టులో ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినా అధికారులు స్పందించలేదన్నారు. మత్స్యశాఖ వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

విమానాశ్రయం కారిడార్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : జాతీయ రహదారి వెంట చేపడుతున్న గన్నవరం విమానాశ్రయం కారిడార్ పనులను వేగంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు.

నాటుసారాతో అనారోగ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి

నాటుసారా సేవనం ఆరోగ్యానికి హానికరమని ఎస్ఈబీ మొవ్వ ఎస్ఐ గారవల్లి వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం చల్లపల్లి మండలం వక్కలగడ్డలో ఎస్ఈబీ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన ప్రచారం నిర్వహించారు. నాటుసారా తయారీ, విక్రయాల సమాచారం 9440902446 నంబరుకు అందచేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే పీడీ యాక్ట్, గ్రామ బహిష్కరణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-కోడూరు

ఎస్జిఎఫ్ సాఫ్ట్ బాల్ ఉమ్మడి కష్ణా జిల్లాల అండర్ 14 జిల్లాస్థాయి ఎంపిక పోటీలు డిసెంబరు



ఒకటో తేదీన జరిగాయి. ఈ పోటీలలో వి.కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు పట్టంశెట్టి తేజస్విని, రేపల్లె యశోద ప్రతిభను కనబరిచి త్వరలో పశ్చిమగోదావరి జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు తెలిపారు. పోటీలలో ఎంపికైన విద్యార్థినీలను వారికి శిక్షణ ఇచ్చిన వీడి బడే వెంకటేశ్వరావు ను విద్యా కమిటీ చైర్ పర్సన్ లక్ష్మీ కష్ణవేణి, గ్రామపంచాయతీ సర్పంచ్ నాంచారయ్య, గ్రామ పెద్దలు . రాజయ్య, వేముల, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వరావు వీరిని అభినందించారు.

కెవిపికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం

హైదరాబాద్ నుండి గన్నవరం విమానాశ్రయానికి కాంగ్రెస్ రాష్ట్ర నేత కేవీపీ



విమానాశ్రయంలో కెవిపి రామచంద్రరావు

రామచంద్రరావు శుక్రవారం చేరుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మ శ్రీ,నాయకులు, కార్యకర్తలు. స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో విజయవాడ వేదిక కళ్యాణ మండపానికి బయలుదేరి వెళ్లారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

ప్రజాశక్తి-పెదపారుపూడి

మాండూస్ తుఫాను నేపథ్యంలో వర్షాలు కురుస్తున్నందున రైతులు తమ పొలాల్లోని వరి కోతలు నిలుపుదల చేయాలని తహశీల్దార్ వరుకూటి నాగభూషణం కోరారు. గత రెండు రోజులుగా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కోసిన పనలను కుప్పలుగా వేసుకోవాలని, వరికుప్పలమీద తడవకుండా పరదాలు కప్పుకోవాలని, హార్వెస్టర్ తో కోసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకుంటూ, మిల్లులకు తరలించాలని ఆయన రైతులకు సూచించారు.

గ్రామసింహాలతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలంలోని ముస్తాబాద, గన్నవరం, కేసరపల్లి, బుద్ధవరం, అల్లాపురం, సూరంపల్లి గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం



చేస్తున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఏ రోడ్డులో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు వీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట ద్విచక్ర వాహనదారుల వెంటపడి మరీ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాటిని తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పట్టపగలు జన సంచారం ఉన్న ప్రాంతాల్లో మనుష్యుల మీద పడి కరుస్తున్నాయని వాపోతున్నారు. రాత్రి సమయాలోల వీటి ఆగడాలకు హద్దూ, అదుపు లేకుండా పోతున్నాయన్నారు. వీధి కుక్కలు బురదలో, మురికి కాలువలో దొర్లి శరీరమంతా మురికి అంటించుకుని గ్రామాల్లో ఇండ్లవద్ద కూర్చుని మురికి చేస్తున్నాయి. అలాగే కుళ్లిపోయిన ఆహార పదార్థాలు, కుళ్ళిన మాంసాన్ని, బొవికలను జనసంచార ప్రాంతాల్లోకి తీసుకొచ్చి తిన్నంత తిని మిగిలింది అక్కడే వదిలి పెడుతున్నాయి. దీంతో ఆ ప్రదేశమంతా అపరిశుభ్రంగా తయారయి రోగాలకు కారణ మవుతున్నాయి. తలుపులు తెరచి ఉన్న ఇళ్ళల్లో చొరబడుతున్నాయి. వెళ్లగొడితే మీదపడి కరుస్తున్నాయి. కుక్కలు కాటువేస్తే ప్రాణాంతమైన రేబిస్ వ్యాధి సోకి మరణించే అవకాశాలు ఉన్నాయి. గత ఆరునెలల కాలంలో గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో 130 మంది, ముస్తాబాద ప్రభుత్వాసుపత్రిలో 62 మంది కుక్క కాటుకు గురైనవారు చికిత్స పొందారని సమాచారం. గ్రామాల్లో రోజురోజుకూ కుక్కల సంఖ్య వేగంగా పెరుగుతోంది. అత్యవసర పనులపై బయటకు రావాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతన్నామని ముస్తాబాద గ్రామస్తులు వాపోతున్నారు.



సమరశీల పోరాటాలకు సిద్ధంకావాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

కార్మికులు సమర శీల పోరాటానికి సిద్ధంగా ఉండాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం నారాయణరావు పిలుపునిచ్చారు. స్థానిక గుంటూరు బాపనయ్య భవనంలోని సీఐటీయూ కార్యాలంలో శుక్రవారం చల్లపల్లి మండల 4వ మహాసభ సిహెచ్ భవాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోర్టు సూచించినా ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో విఫలమయ్యాయన్నారు. అనంతరం మహాసభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. నూతన అధ్యక్షురాలిగా గంగాభవానీ, కార్యదర్శిగా మహమ్మద్ కరీముల్లా ఎన్నికయ్యారు. ఎం.నాగమణి, కనగాల ప్రసాద్, గంజాల రాధాకష్ణ, ముత్యాల రామకష్ణ, ముంతాజ్ బేగం, లలిత, ఇందిర సభ్యులుగా ఎన్నికయ్యారు. సీఐటీయూ పతాకాన్ని సిఐటియు మండల శాఖ అధ్యక్షురాలు భవాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మహమద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం అన్ని ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని మచిలీపట్నం డిఎస్ఆర్ హిందూ లా కళాశాల ప్రిన్సిపాల్ విజేఎల్ రాయులు అన్నారు. శనివారంనాడు ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రభుత్వ లేడీ యంప్తుల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం, భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 21 కీలకంగా పనిచేస్తుందన్నారు. వాటి పరిరక్షణ కోసం జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయిలో మానవ హక్కుల కమిషన్లు పనిచేస్తున్నాయన్నారు. ఎలాంటి కేసుకి సంబంధించి ఎవరైనా 24 గంటల మించి కస్టడీలో ఉంచినప్పుడు మానవ హక్కుల కమిషనరుకి ఫిర్యాదు చేయొచ్చునన్నారు. ప్రతి పౌరుడు ముఖ్యంగా విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎన్ విజయశ్రీ, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు, అధ్యాపకులు శ్రీనివాస్, మున్నవర్, రేపల్లె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ చోరీచేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బంటుమిల్లి

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్ట పరమైన చర్యలతో పాటు జరిమానా తప్పనిసరి అని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరించారు. బంటుమిల్లి మండలంలోని విద్యుత్ శాఖ అధికారులు పలు గృహ, వ్యాపార విద్యుత్ కనెక్షన్లను తనిఖీచేశారు. మండలంలోని 1330 సర్వీసులను తనిఖీ చేశారు. 109 సర్వీసులు అధిక లోడుతో వాడుతున్నట్లు గుర్తించి రూ.3.97 లక్షలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. మరో రెండు సర్వీసులు చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించి రూ.40 వేలు జరిమానా విధించారు. మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.భాస్కరరావు, విజిలెన్స్ ఎడిఇ, ఎఇలు, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.భాస్కరరావు

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

చిట్టూరి సాసిక సాయి పుట్టినరోజు సందర్భంగా వారి తాతయ్య సింగంశెట్టి ఆదినారాయణ సహకారంతో లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిరుపేదలకు దుప్పట్లు శుక్రవారం పంపిణీచేశారు. అంబేద్కర్ నగర్‌లోని సమత పాఠశాలలో వికలాంగులకు, సాయి విద్యానికేతన్ పాఠశాలలోని విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు



వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీచేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఫణి గోపాల్, విశ్వేశ్వరరావు, బాపయ్య, వైపిసి ప్రసాద్, ఉపాధ్యాయుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

చిలకలపూడి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారంనాడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిలకలపూడి, దిమ్మల సెంటర్, కొత్తపేట, లక్ష్మణరావు పురం, ఎన్ జి ఓ కాలనీ , విశ్వబ్రాహ్మణ కాలనీ, సర్కార్ తోట, కొబ్బరి తోట , సి ఎస్ ఆర్ నగర్ , గాంధీనగర్, బ్రహ్మపురం, పరాసు పేట, నరసింహ నగర్, బచ్చుపేట, నాయర్ బడ్డీ సెంటర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీ సీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) ఎం.భాస్కరరావు తెలిపారు.

స్కాలర్‌షిప్ కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం నిలుపుదల చేసిన మైనారిటీ స్కాలర్ షిప్ లను కొనసాగించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ గుడ్లవల్లేరు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కౌతవరం 1 వార్డు ఎలిమెంటరీ స్కూల్ వదిలేసిన అనంతరం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌతావరం ఉర్దూ స్కూల్ ఎస్.ఎఫ్.ఐ కమిటీ కార్యదర్శి ఖాదీయా తాహేరా,ప్రెసిడెంట్ యాదుల భాస్కర్, కమిటీ సభ్యులు వి.తనుజ,ఎండి సైపుల్లా తదితరులు మాట్లాడారు. ఎలిమెంటరీ స్కూల్ కమిటీ ప్రెసిడెంట్ ఎండి రియాజ్, సెక్రటరీ అస్మిత అర్జా, వైస్ ప్రెసిడెంట్ కొఠారి అక్షయ, జాయింట్ సెక్రటరీ ఉమా శంకర్, శర్వాణి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

జెఇఇ మెయిన్స్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - వన్‌టౌన్

భారత విద్యార్థి ఫెడరేషన్-ఎస్‌ఎఫ్‌ఐ విజయవాడ పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థులకు జె.ఈ.ఈ మెయిన్స్ అడ్వాన్సుడ్ పుస్తకాలును ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం. సోమేశ్వరరావు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు పాల్గొని కొత్తపేటలో గల మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థులకు జె.ఈ.ఈ మెయిన్స్ అడ్వాన్సుడ్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎం. సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు సమస్యల మీద పోరాటమే కాకుండా ప్రతి విద్యా సంవత్సరం పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ (మరియు) సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఎస్‌ఎఫ్‌ఐ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్యతరగతి విద్యార్థులకు న్యూ ఎడ్యుకేషన్ పాలసీ -(2020) పేరుతో



విద్యను దూరం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పశ్చిమ నగర అధ్యక్షులు బాలు, ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు జి.గోపి నాయక్, విజయవాడ నగర నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీలలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి రాజు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలిచిన కాలేజీ జట్లు ఈ నెల 12వ తేదీలోగా తమ కాలేజీ జట్ల పేర్లను పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి జి రఘునాథ్ వద్ద నమోదు చేసుకోవాలన్నారు. రెండు రోజులపాటు జరిగే పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను కష్ణా యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పురుషుల జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-మైలవరం : క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎల్వీఆర్సి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె అప్పారావు అన్నారు. స్థానిక లక్కిరెడ్డి బాల్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శిస్తూ రాగద్వేషాలకు అతీతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె హరినాథ్ రెడ్డి, కే తిమ్మారెడ్డి, ఫైనాన్స్ మేనేజర్ ఎస్ కాశిరెడ్డి, వివిధ విభాగాతిపతులు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ, వినియోగంపై వర్క్ షాప్

ప్రజాశక్తి -తిరువూరు

తిరువూరు శ్రీవాహినీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విద్యార్థులకు ఎలక్ట్రా నిక్ పరికరాల తయారీ, వినియోగంపై మూడు రోజుల వర్క్ షాప్ శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల చైర్మన్ పసు మర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం లేనిదే మనిషి మనుగడ సాగించటం కష్టంగా మారిందన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు వచ్చిన తరు వాత గంటలో అయ్యేపనిని పది నిమి షాల్లో పూర్తి చేయగలిగే స్థాయికి వ చ్చిందన్నారు. వాటి తయారీ ఎంత ఉ పయోగమో వినియోగం కూడా అంత కంటే ఉందన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్ర బాబు, కార్యదర్శి సుబ్రహ్మ ణ్యం, అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

మిర్చిలో ఎర్రనల్లి పురుగు నివారణపై అవగాహన

ప్రజాశక్తి -తిరువూరు : తిరువూరు మండలం, కొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో మిర్చి పంటలో పూతపై దాడి చేస్తూ, పంటను నాశనం చేసే ఎర్రన ల్లి పెరిగే విధానం, వాటిని ఎలా నివా రించాలనే అంశంపై ఉద్యానవన శాఖ అధికారి ఎస్.కె. సోహెల్ అహ్మద్ రైతు లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎర్రనల్లి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలను రైతులకు అందచేశారు. ఈకార్యక్ర మంలో సర్పంచ్ బంకా వెంకటేశ్వర్లు, విఎఎ మణిదీప్, రైతులు పాల్గొన్నారు.

భవానీ దీక్షల విరమణ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 15న నుండి 19వ తేదీ వరకూ నిర్వహించు శ్రీ అమ్మవారి భవానీ దీక్షా విరమణల నేపథ్యంలో శుక్రవారం విజయవాడ నగర పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా, ఆలయ కార్యనిర్వహణాధికారి దర్బముళ్ల భ్రమరాంబ ఏర్పాట్లను పరిశీలించారు. దేవస్థానం నందు 15 నుండి 19 వరకు (ఐదు రోజులపాటు) రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు భవానీలు మాలా విరమణకు రానున్న నేపథ్యంలో దుర్గగుడి అధికారులు వినాయకుని గుడి వద్ద నుండి కొండపైకి క్యూ లైన్లతో పాటు సకల సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ అమ్మవారి భవానీదీక్షా విరమణ మహోత్సవాల ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించి, ఆలయ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ జోన్ ఏసిపి కె. హనుమంతరావు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ ఆర్. సురేష్ రెడ్డి, పోలీసు శాఖ అధికారులు, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్లు లింగం రమాదేవి, ఆలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిపి కాంతి రాణా టాటా, ఇఓ భ్రమరాంబ తదితరులు


ముఖ్యమంత్రికి వివాహ పత్రికను అందజేస్తున్న వెలంపల్లి

సిఎంను కలిసిన ఎంఎల్‌ఎ వెలంపల్లి

- కుమార్తె వివాహానికి రావాలని ఆహ్వానం

ప్రజాశక్తి - వన్‌టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని స్థానిక తాడేపల్లిలోని తన కార్యాలయంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 14న తన కుమార్తె వెలంపల్లి సాయి అశ్విత వివాహానికి రావాలని కోరుతూ సిఎం జగన్‌కు ఆహ్వాన పత్రికను అందచేశారు.

వైఎస్ భారతికి జన్మదిన శభాకాంక్షలు తెలిపిన వెలంపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సతీమణి అయిన వైఎస్ భారతికి వెలంపల్లి శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈ నెల 14న తన కుమార్తె వివాహానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందచేశారు.

నేటి నుండి బిల్డింగ్ మెటీరియల్ ఎక్స్‌పో




ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్స్ ఎపి ఛాప్టర్ ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీలలో నగరంలోని ఎస్.ఎస్. కన్వెన్షన్ హాల్‌లో బిల్డింగ్ మెటీరియల్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ఛాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎం.క్రాంతి కుమార్ తెలిపారు. లబ్బీపేటలోని కన్వెన్షన్ సెంటర్ నందు శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమంలో బిల్డింగ్ మెటీరియల్ ప్రదర్శనతో పాటు సెమినార్లు, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ ఆర్కిటెక్చర్స్, ఈఎక్స్‌పోలో పాల్గొని సెమినార్‌లో ప్రసంగిస్తారని తెలిపారు. ఛాప్టర్ సంయుక్త కార్యదర్శి వి.వేణుగోపాల్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే బిల్డింగ్ ఎక్స్‌పో నందు ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్స్, బిల్డర్స్, ఇంటీరియర్ డిజైనర్స్ పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇ. విజయభాస్కర్, ట్రెజరర్ కె.రాధాకృష్ణ, కె.విజయ ఆనంద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

ప్రజాశక్తి -తిరువూరు

సొసైటీ, ఆర్బికేల ద్వారా ధాన్యం కొను గోలు కేంద్రాలను ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం నేటి వరకు కూడా ఏ ఒక్క రైతు నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటే శ్వర్లు కౌలు రైతుసంఘం మండల కా ర్యదర్శి మర్సకట్ల ప్రభాకరరావు పేర్కొన్నారు. దాన్యం కొనుగోలలో ప్రభుత్వం విధించిన నిబంధనలు అడ్డంకిగా ఉండటంతో కోతలు ప్రారంభమై 20 రోజు లవుతున్నా రైతుల నుండి ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయలేకపో తున్నారని తెలిపారు. తిరువూరు మం డలంలోని మునకూళ్ల, వావిలాల, టేకు లపల్లి, చింతలపాడు, ముష్టికుంట్ల సొ సైటీల పరిధిలోని రైతులను కలిసి న ప్పుడు ఆర్బికెలలో ధాన్యాన్ని కొనుగో లు చేయడంలేదని తమ దష్టికి తీసు కువచ్చారని చెప్పారు. వెంటనే ధాన్యా న్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకొని దళారుల బారిన రైతులను కాపాడాలని శుక్రవారం వెంకటేశ్వర్లు, ప్రభాకరరావు చప్పిడి సురేష్ తహశీ ల్దార్ కు వినతిపత్రం అందజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

అందుబాటులోకి ట్రూ కాలర్‌తో సేవలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ట్రూ కాలర్‌యాప్ ద్వారా అన్ని రకాలైన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ట్రూ కాలర్ డైరెక్టర్ ప్రజ్ఞామిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. పౌర సేవలలో విశ్వాసాన్ని ఏర్పరచడంతో పాటు డిజిటల్ డైరెక్టరీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యా సంస్థలు, ఆసుపత్రులు ఇతర సంస్థల వివరాలను అందించడంతో పాటు మనకు కావాల్సిన సేవలను పొందవచ్చని తెలిపారు. తొలిసారిగా ట్రూ కాలర్ సేవల ద్వారా పూర్తి సమాచారం తెలుసుకునే విధంగా అవకాశం ఉంటుందని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు పాటించవలసిన నియమ నిబంధనలు ట్రాఫిక్ రూల్స్, వివిధ అంశాలపై సీఐ సతీష్ అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ తప్పనిసరిగా ఉండాలని, ఆటోలో టేప్ రికార్డులు డెక్కులు పెట్టకూడదని, డ్రైవర్ పక్కన ఎవరిని ప్రయాణికులను కూర్చోబెట్టుకోకూడదని పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించ కూడదని తెలిపారు. ఎవరైతే ఆటో డ్రైవర్లు ఈ నియమ నిబంధనలో పాటించకపోతే ఆటోలు సీట్ చేస్తామని హెచ్చరించారు.